క్లుప్తంగా

విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలి


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

గన్నేరువరం: మండలంలోని చాకలివానిపల్లె గ్రామ పంచాయతీ కూనవానిపల్లెలోని ఎస్ఎస్ 13 ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌స్తంభాన్ని మార్చాలని రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. మండలంలోని విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, 11 కేవీ వైర్లు ఒకదానికి ఒకటి తగులుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. గ్రామాల్లో లూజ్‌వైర్ల వద్ద మిడిల్ పోల్స్ వేయడం లేదని, ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్మశనవాటిక కబ్జాపై చర్యలు తీసుకోవాలి

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లిలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 431లోని కొత్తపల్లి శ్మశనవాటిక భూమి కబ్జాకు గురైందని, శ్మాశనవాటిక భూమి గుర్తించి చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు కసుబోజుల వెంకన్న శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కొందరు రాజకీయ ముసుగులో పక్కన ఉన్న పట్టా భూమిని కొనుగోలు చేసి శ్మాశనవాటిక భూమిని కబ్జా చేసి ప్లాట్లుగా విక్రయించి రూ.కోట్లు గడిస్తున్నారని ఆరోపించారు. గతంలో శ్మశనవాటిక కబ్జాపై హైదరాబాద్ సీసీఎల్ఏ కమిషనర్, జిల్లా కలెక్టర్, జమ్మికుంట తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అధికారులు దృష్టిసారించి, శ్మాశనవాటికకు హద్దులు నిర్ణయించి చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థినికి ఆర్థికసాయం


నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు

హుజూరాబాద్‌రూరల్: పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన మండలంలోని సింగాపూర్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిని కొండి సాహిత్యను ఉపాధ్యాయ బృందం శుక్రవారం అభినందించారు. విద్యార్థిని ఉన్నత చదువుకు తెలుగు ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు దాతల సహకారంతో రూ.50 వేలు సేకరించారు. ఎంఈవో భూపతి శ్రీనివాస్ టీచర్ల సమక్షంలో విద్యార్థినికి నగదు ఇచ్చారు.

సన్మానం



హుజూరాబాద్: పట్టణంలోని న్యూ కాకతీయ పాఠశాల ఆవరణలో కరాటే నేర్చుకుంటున్న విద్యార్థులు బెల్ట్ మెరిట్ టెస్టులో ప్రతిభ కనబరిచారు. శుక్రవారం కరాటే మాస్టర్ ఎస్కే జలీల్ అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ హాజరై మాట్లాడారు. కరాటే ద్వారా ఆత్మరక్షణ అలవడుతుందన్నారు. కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ పీఈటీ సారయ్య, ముదిరాజ్ సంఘం జిల్లా నాయకుడు కొలిపాక సమ్మయ్య, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ మాజీ అధ్యక్షుడు ఖలీద్ హుస్సేన్, నాయకులు తదితరులు ఉన్నారు.

పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలి


వినతిపత్రమిస్తున్న విద్యుత్ జేఏసీ నాయకులు

కొత్తపల్లి(కరీంనగర్): విద్యుత్ సంస్థలో 1999 నుంచి 2004 వరకు ఉద్యోగంలో చేరిన వారందరికీ పాత పెన్షన్(జీపీఎఫ్) వర్తింపజేయాలని కోరుతూ శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా విద్యుత్‌శాఖ జేఏసీ ఆధ్వర్యంలో మానకొండూర్, చొప్పదండి ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యంకు వేర్వేరుగా విజ్ఞాపన పత్రాలు అందజేశారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో అమలు చేస్తున్న విధంగానే విద్యుత్ శాఖలో కూడా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. నాయిని అంజయ్య, భాస్కర్, శ్రీనివాస్, సంపత్, కొలుపుల రాజు, సత్యనారాయణ, శ్రీనివాస్, అరవింద్‌రెడ్డి, శ్రీనివాస్, వీరయ్య, శ్రీమతి తదితరులు పాల్గొన్నారు.

ఇక ప్రశాంతంగా ఓటు

- పోలింగ్ కేంద్రాల పెంపునకు కసరత్తు
- బీఎల్వోలకు గుర్తింపు కార్డులు
- సమీపంలో మొబైల్ కౌంటర్ల ఏర్పాటు



కరీంనగర్ అర్బన్: ఎన్నికలను మరింత సులభతరం చేస్తూ ఎన్నికల కమిషన్ చర్యలు చేపడుతోంది. ఓటింగ్ వ్యవస్థను మరింత సరళీకతం చేసేందుకు వీలైనన్ని మార్గాలను అన్వేషిస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే పలు సంస్కరణలు చేపట్టిన ఎన్నికల సంఘం మరిన్ని చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా యువతను పోలింగ్ కేంద్రాల వైపు అడుగులు వేయించేందుకు పలు సంస్కరణలు చేస్తున్నారు. ఇందులో భాగంగా గతంలో 1,500 మందికో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయగా.. తాజాగా ఈ సంఖ్యను 1,200కు తగ్గిస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలో 1,200 కంటే ఎక్కువ ఓటర్లున్న పోలింగ్ కేంద్రాలను గుర్తించే ప్రక్రియలో సిబ్బంది నిమగ్నమయ్యారు.

1,200 మందికో పోలింగ్ కేంద్రం

ప్రధానంగా తక్కువ పోలింగ్ నమోదయ్యే పట్టణ ప్రాంతాల్లోనే 1,200 మంది కంటే ఎక్కువ ఓటర్లున్న పోలింగ్ కేంద్రాలు ఎక్కువగా ఉండన్నాయి. జిల్లాకేంద్రంలో ఇలాంటి కేంద్రాలను 102 గుర్తించారు. ఇలా 4 నియోజకవర్గాల పరిధిలో 200 వరకుండగా.. వంద పోలింగ్ కేంద్రాల వరకు పెరిగే అవకాశముంది. ప్రస్తుతం 1,339 పోలింగ్ కేంద్రాలున్నాయి.

మొబైల్ కౌంటర్లు

ప్రస్తుత సమాజంలో వయసుతో సంబంధం లేకుండా ప్రతీ ఒక్కరు చరవాణి వినియోగిస్తున్నారు. అయితే పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లకు ప్రవేశం లేదు. ఈ సమస్యను అధిగమించేందుకు ఎన్నికల సంఘం పోలింగ్ కేంద్రాల నుంచి వంద మీటర్ల వెలుపల మొబైల్ కౌంటర్లు ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకుంది.

బీఎల్వోలకు గుర్తింపు కార్డులు

ఓటరు జాబితా రూపకల్పనలో కీలకంగా వ్యవహరించే బీఎల్వోలకు గుర్తింపు కార్డులు అందించనున్నారు. త్వరలోనే ఎన్నికల సంఘం వెబ్‌సైట్లో బీఎల్వోల వివరాలు నిక్షిప్తం చేసి ఈనెల 23 లోగా వాటిని అందించేందుకు అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. బీఎల్వోల్లో అధికంగా అంగన్వాడీ, పురపాలికల్లోని మెప్మా సిబ్బంది ఉన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1,200కు మించి ఓటర్లుండకుండా చర్యలు చేపడుతున్నామని, గుర్తింపు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోందని జిల్లా ఎన్నికల విభాగ అధికారులు వివరించారు. ఈనెల 23 లోపు బీఎల్వోలకు గుర్తింపు కార్డులందించేలా కసరత్తు చేస్తున్నామని వివరించారు.

నియోజకవర్గాలవారీగా పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల సంఖ్య

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	ఓటర్లు
కరీంనగర్	390	3,61,775
చొప్పదండి	327	2,32,413
మానకొండూర్	316	2,24,609
హుజూరాబాద్	305	2,49,483



రామడుగు: కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై వెదిర గ్రామ పరిధిలోని కోనరావుపేట బస్టాండ్‌ను శుక్రవారం గ్రామ పంచాయతీ కార్మికులు శుభ్రం చేశారు. బస్టాండ్‌లో చెత్తాచెదారం పేరుకుపోయిందని శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన వాట్సాప్ కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కారోబార్ పన్యాల అశోక్‌రెడ్డి జీపీ కార్మికులతో బస్టాండ్‌ను శుభ్రం చేయించగా ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి స్పందన

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

విద్యుత్ అధికారుల పొలంబాట


శంకరపట్నం: నల్లవెంకయ్యపల్లిలో పొలంబాట

శంకరపట్నం: మండలంలోని నల్లవెంకయ్యపల్లి గ్రామంలో శుక్రవారం ట్రాన్స్‌కో ఉద్యోగులు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయం పనులు ప్రారంభమైతే లూజ్‌లైన్లు, వంగిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలు పరిష్కరించేందుకు పొలం బాట చేపట్టినట్లు ట్రాన్స్‌కో ఏఈ రఘు తెలిపారు. ఆముదాలపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో 33కేవీ కొత్త లింక్‌ను డీఈ లక్ష్మారెడ్డి, ఏడీ శ్రీనివాస్, ఏఈ రఘులు ప్రారంభించారు.

గన్నేరువరం: మండలంలోని మైలారం గ్రామంలో విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ ప్రమాదాలు, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. మోటార్ల వద్ద కెపాసిటర్లు వాడడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, కెపాసిటర్లు ఏర్పాటు చేసుకొని సంస్థ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. లూజ్‌లైన్లు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ ఆంజనేయులు, విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని గంగిపల్లి గ్రామంలో విద్యుత్ అధికారులు పొలంబాటలో విద్యుత్ ప్రమాదాలపై రైతులకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయని రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ సమస్యలు తలెత్తితే వెంటనే విద్యుత్ అధికారులకు తెలియజేయాలని కోరారు. చెంజర్ల విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ లక్ష్మణామూర్తి, అలుగునూర్ సబ్ డివిజన్, కరీంనగర్ రూరల్ డివిజన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

హుజూరాబాద్: పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ ఏఈ శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

శంకరపట్నం: కొత్తగట్టు సబ్‌స్టేషన్‌లో శనివారం విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్నందున ఉదయం 10:30 గంటల నుంచి 12:30 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నామని ఏఈ తెలిపారు. కొత్తగట్టు, లింగాపూర్, గొల్లపల్లి గ్రామాల్లో విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

నేడు యోగా దినోత్సవం

చొప్పదండి: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలో శనివారం ఉదయం ర్యాలీ నిర్వహించనున్నామని ఆధ్యాత్మిక సేవా సంఘాల ప్రతినిధులు తెలిపారు. ఉదయం ఆరుగంటలకు వివేకానంద విగ్రహం నుంచి అయ్యప్ప ఆలయం వరకు, అక్కడి నుంచి రాంలీలా మైదానంకు వెళ్లి యోగాసనాలు వేయనున్నామని, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జవహర్ నవోదయ విద్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాలు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు.

ప్రవేశాలు ప్రారంభం

వీణవంక: వీణవంక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ కె.రాజిరెడ్డి తెలిపారు. ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, ప్రవేశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పది పాసైనవారి ఇంటింటికి వెళ్లి కళాశాలలో చేరే విధంగా ప్రచారం చేస్తున్నామని, ఎంపీసీ పూర్తయిన విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్య ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో ఉచితంగా పొందడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. పుస్తకాలు ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు ఎస్. రామ్మోహన్, అధ్యాపకులు సీహెచ్ భాస్కర్, బి. రవీందర్, కత్తెరశాల, పి.కల్పన, ఎం.శైలజ, కే.శోభన్ బాబు, ఏ.జైపాల్ రెడ్డి, పి. సుమలత, కే.కరుణ, స్వప్న, బోధనేతర సిబ్బంది ఎండీ జమీల్ విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షాలు పడాలని..



హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పెద్దపాపయ్యపల్లిలో గ్రామస్తులు వర్షాలు పడాలంటూ శుక్రవారం కప్పతల్లి ఆడారు. వానలు కురిసి పంటలు పండాలని ఆశిస్తూ గ్రామంలోని రైతులు, మహిళలు కప్పలను అలంకరించి గ్రామంలో ఊరేగించారు. పాటలు పాడుతూ కప్పతల్లి పూజలు చేశారు.

సంక్షిప్త వార్తలు

✦ మోదీ పాలన ప్రపంచ దేశాలకు ఆదర్శం

హుజూరాబాద్: మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగిరేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకుసాగాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని ఇప్పలనర్సింగాపూర్ గ్రామంలో రచ్చబండ కార్యక్రమం పట్టణ శక్తి కేంద్ర ఇంచార్జి యాళ్ల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. . మోదీ పాలన ప్రపంచ దేశాలకే ఆదర్శంగా మారిందని, దేశం అన్ని రంగాల్లో వృద్ధి చెందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి తెలియజేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

గన్నేరువరం: భారతదేశం శక్తివంతంగా ఎదగడం ప్రధాని నరేంద్రమోదీతోనే సాధ్యమైందని బీజేపీ మండల కోకన్వీనర్ పుల్లెల రాము అన్నారు. 11 ఏళ్ల మోదీ పాలనను మండల కేంద్రంలోని ప్రజలకు శుక్రవారం వివరించినట్లు తెలిపారు. పేదలు, రైతు ల సంక్షేమానికి అనేక పథకాలను చేపట్టిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి అండగా నిలవాలన్నారు.

✦ పుస్తకాలు పంపిణీ

చొప్పదండి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ప్రిన్సిపాల్ శరత్‌బాబు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చేరిన విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు, బస్సు పాస్ సౌకర్యం, స్కాలర్‌షిప్ సౌకర్యం ఉందని, పదవ తరుగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అడ్మిషన్ పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

✦ చిగురుమామిడి మండలంలో..

చిగురుమామిడి: మండలంలోని 22 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు నోట్‌బుక్స్ పంపిణీ చేసినట్లు ఎంఈవో పావని తెలిపారు. నోట్‌బుక్స్‌తో పాటు టెక్స్ట్‌బుక్స్, రెండు జతల యూనిఫాం, షు, టై బెల్ట్‌లు కూడా అందించామన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలని ఆమె కోరారు.

✦ 3 ఇసుక లారీల పట్టివేత

మానకొండూర్: మండలంలోని ఊటూరు నుంచి కరీంనగర్ కు ఇసుకను అక్రమంగా లారీల్లో తరలిస్తుండగా శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు మానకొండూరు సీఐ బి.సంజీవ్ తెలిపారు. లారీ యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

✦ దివ్యాంగుడికి చేయూత

రామడుగు: మండలంలోని పందికుంటపల్లి గ్రామ పరిధిలో ఉన్న కుర్మపల్లి గ్రామానికి చెందిన చిమ్మల్ల శ్రీనివాస్‌కు ప్రవాస భారతీయుల స్వచ్ఛంద సేవా సంస్థ హోప్ ఫర్ స్పందన ఆధ్వర్యంలో నార్త్ అమెరికా తెలుగు సంఘం నాట్స్ సహకారంతో స్వయం ఉపాధి కోసం కిరాణషాపు ఏర్పాటుకు రూ.1.70 లక్షలు వెచ్చించి శుక్రవారం సంస్థ ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం చేశారు. 11 సంవత్సరాల క్రితం ప్రమాదంలో వెన్నెముక దెబ్బతిని వీల్‌ఛైర్, మంచానికి పరిమితమైన శ్రీనివాస్ కుటుంబ పోషణ ఇబ్బందిని గుర్తించి ఆర్థిక సహాయం అందజేశారు. ఇప్పటివరకు 116 మంది దివ్యాంగులకు పలు రకాలుగా సహకారం అందజేశామనిని తెలుగు రాష్ట్రాల హోప్ ఫర్ స్పందన సమన్వయ కర్త డాక్టర్ రఘు అరికపూడి తెలియజేశారు.

✦ సహకార సంఘం ఏర్పాటు చేయాలి

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్‌లో సహకార సంఘం ఏర్పాటు చేయాలని డీసీవో రామాంజనేయులుకు రైతులు వినతిపత్రం అందించారు. గతంలో మొలంగూర్ సహకార సంఘంలో మొలంగూర్, కొత్తగట్టు, చింతలపల్లి. కన్నాపూర్, అర్కండ్ల, ధర్మారం గ్రామాల రైతులు సభ్యులుగా ఉన్నారని, 2005లో మొలంగూర్ సహకార సంఘాన్ని మెట్‌పల్లి సంఘంలో విలీనం చేశారన్నారు. గ్రామాల రైతులకు ఇబ్బంది కలుతున్నందున మొలంగూర్‌లో సహకార సంఘాన్ని పునఃరుద్ధరణ చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

✦ శుక్రవారం సభలు

శంకరపట్నం: మండలంలోని గద్దపాక, అర్కండ్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు పద్మ, అరుణ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

✦ సమరశీల పోరాటాలు ఉధృతం చేయాలి

కరీంనగర్: దేశంలో మతోన్మాద కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలందరినీ ఐక్యం చేసి సమరశీల పోరాటాలు మరింత ఉధృతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ముకుందలాల్ మిశ్రాభవన్‌లో సీపీఎం జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతుల సందర్భంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. బడా కార్పొరేట్ సంస్థల ఆస్తులు పెరిగాయని, సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేయబడ్డారన్నారు. శిక్షణ తరగతులకు శ్రీనివాస్ ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు.

✦ ఇంటింటి సర్వే

మానకొండూర్‌రూరల్: ఇంటింటి సర్వే కార్యక్రమంలో భాగంగా జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఎస్ఓ) ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని వెల్ది, రంగపేట, లక్ష్మీపూర్ గ్రామాలలో సర్వే బృందం సభ్యులు ఇంటింటా సర్వే చేశారు. ఆరోగ్యం, అక్షరాస్యత, సాంఘిక, ఆర్థిక అంశాలపై బృంద సభ్యులు వివరాలు సేకరించారు.

ఎమ్మెల్యే సతీమణికి నివాళి


చొప్పదండి: అన్నదానం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

చొప్పదండి/గంగాధర/రామడుగు: చొప్పదండిలో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి వర్ధంతి నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. అన్నదానం నిర్వహించారు. గంగాధర మండలం మధురానగర్‌లోరూపాదేవి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. బూర్గుపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె జ్ఞాపకార్థం నాయకులు సంపత్, దూలం ఆంజనేయులు, గడ్డం అంజయ్య ప్రభుత్వ పాఠశాలకు రూ.15 వేలు విలువ చేసే వాటర్ కూలర్ అందజేశారు. రామడుగు మండలం వెలిచాల గ్రామ పరిధిలోని స్పందన వృద్ధుల ఆశ్రమంలో పార్టీ మండల అధ్యక్షులు హరీష్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

వార్షికోత్సవం ఘనంగా జరుపుకోవాలి


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రామడుగు: ఎమ్మార్పీఎస్ వార్షికోత్సవాలను జూలై 7న ప్రతీ గ్రామంలో ఘనంగా జరుపుకోవాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ శంకర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా వెదిర గ్రామంలో జెండా గద్దె నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు చిలుముల రాజయ్య, శనిగరపు హన్మయ్య, గుడిసె విజయ్, నేరెల్ల మారుతి, ఎస్ మలయ్య, నర్సయ్య, దుర్గయ్య, నర్సయ్య, అంజయ్య పలువురు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

మానకొండూర్‌రూరల్: గ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని ఊటూర్, రంగపేట, లక్ష్మీపూర్ గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఊటూర్‌లో సైడ్ డ్రైన్, సీసీరోడ్డు, రంగపేటలో సీసీ రోడ్డు, వెల్ది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం-లక్ష్మీపూర్‌లో నిర్మించిన నూతన హాస్పిటల్ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. గ్రామాలను అభివృద్ధి చేయడానికి వివిధ శాఖల ద్వారా నిధులు మంజూరు చేసి పనులు త్వరగా పూర్తి చేస్తున్నామన్నారు. త్వరలో రాజీవ్ యువ వికాసం యువతకు రుణాలు అందజేస్తామన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, గ్రామాల్లోని ఆసుపత్రుల్లో అందించే ఉచిత వైద్యాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో వరలక్ష్మి, డీఈ రవిప్రసాద్, ఏఈ వెంకన్న, నాయకులు రవీందాచ్రారి, ఓదెలు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసరావు, తిరుపతి, సురేశ్, శ్రీనాథ్ రెడ్డి, అశోక్, కొమురయ్య, కుమార్ పాల్గొన్నారు.

అధిక ధరల దందా


నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు

తిమ్మాపూర్: మండల కేంద్రంలో శ్రీచైతన్య ఈ టెక్నో స్కూల్ ఆధ్వర్యంలోని పుస్తక విక్రయ కేంద్రంలో అధిక ధరలకు పుస్తకాలు విక్రయిస్తున్నారు. పాఠశాల ఫీజు చెల్లించి రశీదు చూపిన వారికి మాత్రమే నిర్వాహకులు పుస్తకాలు అందజేస్తున్నారు. పుస్తకాల ధరలు అధికంగా ఉండటంతో తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు నిరసన తెలిపారు. విద్యార్థి సంఘాలు ధర్నా నిర్వహించగా, పోలీసులు జోక్యం చేసుకొని పుస్తక విక్రయ కేంద్రానికి తాళం వేశారు. మూడు రోజులపాటు కేంద్రం మూతబడింది. విషయం విద్యాశాఖ అధికారుల దృష్టికి వెళ్లింది. నిర్వాహకుల నుంచి వివరణ కోరినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఫలితంగా, పోలీసులు నిర్వాహకులకు తాళం అప్పగించడంతో కేంద్రం తిరిగి తెరుచుకుంది. మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌ను సంప్రదించగా పుస్తక విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేసి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని తెలిపారు. అయినా పుస్తకాల విక్రయం కొనసాగుతుండటంతో తల్లిదండ్రులు మీడియాకు సమాచారం అందించారు. మీడియా ప్రతినిధులు అక్కడికి చేరుకోగానే నిర్వాహకులు కేంద్రానికి తాళం వేసి వెళ్లిపోయారు. ఫీజు చెల్లించినప్పటికీ పుస్తకాలు అందకపోవడం, అధిక ధరలతో విక్రయిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

ఎంపీ నిధులతో బోరుబావులు

జమ్మికుంటరూరల్: మున్సిపల్ పరిధి రామన్నపల్లి పాఠశాల, మండలంలోని శాయంపేట, గండ్రపల్లి, శంభునిపల్లి, పాపక్కపల్లి, బిజిగిరిషరీఫ్ గ్రామాల్లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆదేశాల మేరకు బోరుబావులు వేశారు. శుక్రవారం మోటార్లు బిగించామని బీజేపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, పట్టణ, మండల అధ్యక్షులు కొలకాని రాజు, సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

రాజశ్యామల యాగం



గన్నేరువరం: మండలంలోని మాదాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొమ్మెర రవీందర్‌రెడ్డి స్వగృహంలో శుక్రవారం మైలారం గ్రామ శ్రీమల్లికార్జునస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు మామిడాల నాగసాయిశర్మ ఆధ్వర్యంలో శ్రీప్రత్యంగిరా రాజశ్యామల మహారుద్ర సహిత నవ చండీ మహాయాగం నిర్వహించారు. ప్రజాశ్రేయస్సు, పాడి పంటల సమృద్ధిగా ఉండాలని లోకకల్యాణార్థం కార్యక్రమం చేపట్టినట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రూ.50,116 విరాళం

వీణవంక: మండలంలోని గంగారం గ్రామంలో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి ఆర్థికసాయం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు, గంగారం గ్రామస్తులు యాప్‌టీవీ సీఈవో పాడి ఉదయ్‌నందన్‌రెడ్డిని కోరగా వెంటనే రూ.50,116 శుక్రవారం అనుచరులతో అందజేశారు. మాజీ సర్పంచ్, ఆలయ కమిటీ చైర్మన్ పింగిలి కోమల్‌రెడ్డి మాట్లాడారు. ఉదయ్‌నందన్‌రెడ్డి కరోనా సమయంలో నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారని, గ్రామస్తుల తరుపున ఉదయ్‌నందన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వీణవంక మాజీ జెడ్పీటీసీ దాసారపు ప్రభాకర్, వైస్ చైర్మన్ కాసం సంపత్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు కుమార్, కుమారస్వామి, సాయిరెడ్డి, నారాయణ, ప్రభాకర్, శ్రీధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయాలకు ప్రత్యేక బస్సు

హుజూరాబాద్: హుజూరాబాద్ ఆర్టీసీ డిపో నుంచి స్వర్ణగిరి, భద్రకాళి ఆలయాలకు 27న ప్రత్యేక బస్సు సర్వీసు ప్రారంభమవుతుందని డిపో మేనేజర్ రవీంద్రనాథ్ తెలిపారు. సూపర్ లగ్జరీ బస్సుల్లో పెద్దలకు రూ.1000, పిల్లలకు రూ.600 చార్జి ఉంటుందని, వివరాలకు 9959225924, 9704833971, 9247159535, 9441404841 నంబర్ సంప్రదించాలన్నారు.